డాక్టర్ సీఆర్ రావు దేశానికే గర్వకారణం



సీఆర్ రావు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న రెక్టార్ సమత తదితరులు

ఏయూక్యాంపస్: భారతదేశం గర్వించే వ్యక్తిగా ఆచార్య సీఆర్‌రావు ఎదిగారని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. ఏయూ స్టాటస్టిక్స్ విభాగంలో నిర్వహించిన డాక్టర్ సీఆర్ రావు ఎండోమెంట్ లెక్చర్‌ను ఆమె ప్రారంభించారు. ముందుగా ఆచార్య సీఆర్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థిగా ఆయన వర్సిటీ చరిత్రలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని నేటితరం యువత ఉన్నతంగా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాస రావు, విభాగాధిపతి ఆచార్య బి.మునిస్వామి తదితరులు ప్రసంగించారు. డాక్టర్ సి.ఆర్ రావు వద్ద విద్యనభ్యశించి ప్రస్తుతం కాలిఫోర్నియా యూనివర్సిటీ ఆచార్యులుగా సేవలందిస్తున్న జె.శ్రీనివాస రావు 'ఫైనాన్షియల్ ప్రెడిక్షన్స్–డు న్యూస్ అండ్ ఎమోషన్స్ మేటర్' అనే అంశంపై విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. అనంతరం ఆచార్య జె.శ్రీనివాసరావు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో కార్యాలయంలో భేటీ అయ్యారు. వర్సిటీ తరఫున ఆచార్య శ్రీనివాసరావును సత్కరించారు. ఏయూతో అనుబంధం కొనసాగించాలని, దీనిని మరింత బలోపేతం చేయాలని వీసీ ప్రసాద రెడ్డి కోరారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైద్య వ్యవస్థలో ఫార్మాసిస్టులు కీలకం



ర్యాలీలో పాల్గొన్న ఫార్మాసిస్టులు

ఏయూక్యాంపస్: వైద్య వ్యవస్థలో ఫార్మాసిస్టులు కీలకమని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. వరల్డ్ ఫార్మసిస్టుల డే పురస్కరించుకుని ఏయూ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఆర్‌కే బీచ్ నుంచి వైఎంసీఏ కూడలి వరకు ఏయూ ఫార్మసీ విద్యార్థులు, ఆచార్యులు ప్లకార్డులు పట్టుకుని సమాజంలో ఫార్మాసిస్టుల ఆవశ్యకతను, వారి సేవలను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించిన కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మూల్యాంకన కేంద్రం తనిఖీ



మూల్యాంకన విధానం పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో కేంద్రీయ మూల్యాంకన కేంద్రాన్ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆచార్యుల హాజరు, మూల్యాంకనం జరుగుతున్న విధానం ప్రత్యక్షంగా పరిశీలించారు. సెలవు రోజున సైతం ఆచార్యులు పూర్తిస్థాయిలో హాజరై పటిష్టంగా మూల్యాంకన ప్రక్రియను నిర్వహించడంపై సంతోషం వ్యక్తం చేశారు. మూల్యాంకన కేంద్రం అధికారులను ఈ సందర్భంగా అభినందించారు. మూల్యాంకన ప్రక్రియలో పాల్గొన్న ఆచార్యులతో ఆయన మాట్లాడారు.

శ్రావ్యంగా గాత్ర కచేరి



వసుధ రవి కచేరి

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అకాడమి ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం గాత్ర సంగీత విద్వాంసురాలు వసుధ రవి గాత్ర కచేరి శ్రావ్యంగా సాగింది. ఈ కార్యక్రమాన్ని రాజారావు, పేరాల బాలమురళి ప్రారంభించారు. అనంతరం వసుధా రవి తన గాత్రంతో ఖమాస్ రాగంలో, సిద్ధివినాయకం, నన్ను బ్రోవు తదితర కీర్తనలను ఆలపించారు.

ఆరిలోవలో అన్నసమారాధనలు

ఆరిలోవ: వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నిత్యం అన్నసమారాధనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఈ ప్రాంతం సందడి వాతావరణం నెలకుంది. ఇందులో భాగంగా ఆరిలోవలో ఉత్సవాల నిర్వాహకులు ఆదివారం పలుచోట్ల అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. ఇందిరాగనగర్, రాజీవ్‌నగర్, ఆదర్శనగర్, శాంతినగర్, తోటగరువు, సుందరయ్యనగర్ కాలనీ, నెహ్రూనగర్, ఆరిలోవ కాలనీ తదితర ప్రాంతాల్లో అన్నసమారాధన నిర్వహించారు. ఆయా చోట్ల పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

మురళీనగర్: మహాకవి గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ బాలికల హాస్టల్‌లో సాహితీ ప్రవంతి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పోటీలు నిర్వహించారు. గురజాడ తెలుగు భాషకు చేసిన సేవలపై ఏర్పాటు చేసిన వ్యాసరచన,వక్తృత్వ పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా గురజాడ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విజేతలకు బహుమతులు అందించారు.

ఘనంగా రోటరీ పబ్లిక్ ఇమేజ్ సదస్సు



సదస్సును ప్రారంభిస్తున్న రోటరీ ప్రతినిధులు

ఏయూక్యాంపస్: రోటరీ క్లబ్ సామాజిక సేవా కార్యక్రమాలపై ఆదివారం ఒక హోటల్‌లో సదస్సు నిర్వహించారు. ప్రజల్లో సంతృప్తికరమైన భావాలను పెంపొందించే దిశగా సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణపై దీనిలో చర్చించారు. సదస్సును రోటరీ ప్రతినిధులు ప్రారంభించారు. అనంతరం రోటరీ క్లబ్ లు చేస్తున్న ప్రజా సేవా కార్యక్రమాలను విశాఖపట్నం రొటేరియన్ కిషోర్ కుమార్, నేతాజీ, వర్మరాజు వివరించారు. విజయవాడ రోటరీ జిల్లా గవర్నర్ రొటేరియన్ రావూరి సుబ్బారావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై రోటరీ సేవల ప్రచారంలో అనుసరించాల్సిన వివిధ అంశాలను వివరించారు.ఆతిథ్యం వహించిన ఆ రోటరీక్లబ్ గ్రేటర్ విశాఖ అధ్యక్షులు పి.నాగరాజు మాట్లాడుతూ విశాఖనగరంలో జీవీఎంసీ పశువుల ప్రాంగణంలో ఉన్న ఆవులు, కుక్కలు వగైరాలకు ఆహారం అందిస్తున్నామని చెప్పారు. నగరంలోని ఒక మానసిక వికలాంగుల పాఠశాలకు సహకారం అందిస్తున్నారన్నారు. రక్తదాన శిబిరాల ద్వారా త్వరలో 400 యూనిట్ల రక్తం సేకరించబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

కూచిపూడి కళాక్షేత్రం ప్రిన్సిపాల్‌కు సత్కారం



రామ్మూర్తిని దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ఎంవీపీకాలనీ: కూచిపూడి కళాక్షేత్రం ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని గ్రాయత్రి విద్యాపరిషత్ లో జరిగిన ఈ కార్యక్రమంలో కూచిపూడి కళాక్షేత్రం ప్రిన్సిపాల్ గురు హరే రామ్మూర్తిని విద్యార్థు లు సత్కరించడంతో పాటు పాదపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడు తూ వేల మంది విద్యార్థులు కూచిపూడిలో శిక్షణ అందించడంతో పాటు సంస్కృతి, సంప్రదాల విశిష్టతను తెలియజేశారని కొనియాడారు. అనంతరం రామ్మూర్తి, ఆయన సతీమణి సత్యభామల షష్ఠిపూర్తి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయ నిర్మాణ్ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సూరపనేని విజయకుమార్, విశాఖ మ్యూజిక్ అకాడమీ జనరల్ సెక్రటరీ ఎంఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూచిపూడి కళాక్షేత్రంలో శిక్షణ పొందిన విద్యార్థుల సాంస్కృతిక, సంప్రదాయ నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

'హ్యాపీ బర్త్‌డేలు' సంగీత విభావరి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న తిరుమలరావు తదితరులు

ఎంవీపీకాలనీ: ఈ నెల 26వ తేదీన నగరంలోని పౌరగ్రంథాలయం వేదికగా హ్యాపీ హ్యాపీ బర్త్‌డేలు సంగీత విభావరిని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు, ఉపకార్ గ్రూప్ అధినేత, సకల కళాకారుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు కంచర్ల అచ్యుతరావు తదితరులు ఆదివారం లాసన్స్‌బే కాలనీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ 26వ తేదీ సాయంత్రం ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రఖ్యాత గాయనీగాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రేక్షకులను అలరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఐసీ డీవో బొమ్మిడి సత్యనారాయణ, గాయకుడు కేఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలను అడ్డుకుంటాం



ఉక్కు దీక్షలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

కూర్మన్నపాలెం : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అంశం కార్మిక సంక్షేమానికి చేటు అని, కార్మికులందరు కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్య పోరాటాలతో ఎదుర్కొంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహారీ దీక్షలు ఆదివారం నాటికి 955వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగ కార్మికులతో పాటు విశాఖ భారత్ బచావో సభ్యులు సంఘీభావం తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా భారత్ బచావో రాష్ట్ర కార్యదర్శి మార్పు శరత్ మాట్లాడుతూ దేశ సంపదను కారుచౌకగా కట్టబెడితే ఫలితంగా మౌలిక సదుపాయాల కల్పనలన్నీ కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లి ప్రజలపై పన్నుల భారం పడుతుందన్నారు. ప్రజల సొమ్ముతో ప్రభుత్వరంగ సంస్థలను అభివృద్ధి చేసి ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే వారు లాభాలను దండుకుని ప్రజలను ద్రోహం చేస్తారని విమర్శించారు. అనంతరం భారత బచావో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గూడూరి సీతామహాలక్ష్మి మాట్లాడుతూ అమరవీరుల ప్రాణత్యాగాలతో నిర్మించుకున్న ఉక్కు కర్మాగారాన్ని ఎన్ని త్యాగాలు చేసైనా కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా అధ్యక్షులు వేమన, కార్యదర్శి శ్రీనివాసరావు, గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, ఏఐటీయూసీ నాయకులు కే.యస్.యన్, సీఐటీయూ నాయకులు అయోధ్య రామ్, శ్రీనివాసరాజు, వల్లి, ఐఎన్‌టీయూసీ నాయకులు నీరుకొండ రామచంద్రరావు, ఏపీసీయల్‌సీ నాయకులు శ్రీరామమూర్తి, ఏఏపీ నాయకులు శీతల్, భీంసేన్ వార్ నాయకులు చిన్నారావు, రవి, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పోలియో నిర్మూలనకు రోటరీ సహకారం ఎనలేనిది



రోటరీ గవర్నర్‌ను సత్కరిస్తున్న సభ్యులు

గాజువాక : పోలియో మహమ్మారి నిర్మూలన కోసం రోటరీ క్లబ్ అందిస్తున్న సహకారం ఎనలేనిదని ఆ సంస్థ జిల్లా గవర్నర్ ఆర్.సుబ్బారావు (దత్తు) పేర్కొన్నారు. గాజువాకలో ఆయన స్థానిక కమిటీ సభ్యులతో ఆయన ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ బాధ్యతను మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. దీనికోసం అవసరమైన నిధులను సమకూర్చడానికి సభ్యులు కృషి చేయాలన్నారు. క్లబ్ సభ్యులు కూడా ఉదారంగా విరాళాలను అందజేయాలన్నారు. సేవా కార్యక్రమాల్లో గాజువాక రోటరీ క్లబ్ నంబర్ వన్ స్థానాన్ని సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సీహెచ్.రిషికేష్, ప్రతినిధులు తిరుపతిరావు, నారాయణరావు, శివన్నారాయణ, దాస్, తెంటు సత్యనారాయణ, కె.సత్యబాబు తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ రేకులు సరిచేశారు



సరిచేసిన బస్ షెల్టర్ రేకులు

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డులో దీన్‌దయాల్ పురం వద్ద హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవెలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఎదురుగా బస్ షెల్టర్ పైనుంచి వేలాడుతున్న రేకులను జీవీఎంసీ అధికారులు సరిచేశారు. బస్ షెల్టరు పైన ఉన్న రేకులు ఊడిపోయి కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారింది. ఈ పాత్‌వేపై నడిచేవారికి, ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. దీనిపై ఈనెల 23న సాక్షిలో ప్రచురితమైన 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికతో వెలువడిన వార్తకు జీవీఎంసీ అధికారులు స్పందించారు. సిబ్బందితో ఆదివారం ఆ బస్ షెల్టర్‌కు మరమ్మతులు చేపట్టి రేకులను సరిచేయించారు. దీంతో పాత్‌వేపై వెళ్లే వాకర్స్, ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

గణపతి మండపం వద్ద దీపాలంకరణ



దీపాలంకరణలో పాల్గొన్న మహిళలు, యువత

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయ అవుట్‌గేట్ జోన్‌లో శ్రీ రామ లక్ష్మీగణపతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి ఉత్సవాల్లో భాగంగా దీపాలంకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో మహిళలు, యువత పాల్గొని మండపం వద్ద గణపతి ఆకారంలో దీపాలను వెలిగించారు.

చిన్న కుటుంబానికి ఎంపీ పరామర్శ



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 19వ వార్డు జాలరిపేటకు చెందిన చింతపల్లి చిన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో వార్డు పర్యటనలో భాగంగా విశాఖ ఎంపీ, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ మృతుని కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. సచివాలయ ఉద్యోగులు అతని కుటుంబానికి వైఎస్సార్ బీమా ఇప్పటికే అందజేయగా ప్రభుత్వం నుంచి మరింత సహకారం అందించేందుకు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ సూరాడ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో ఘనంగా జాతీయ సేవా దినోత్సవం



కృష్ణా కళాశాలలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

మద్దిలపాలెం : జాతీయ సేవా దినోత్సవాన్ని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ కళాశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. దీనిలోభాగంగా స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలలో భాగంగా కళాశాల పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టాలని కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు అన్నారు. అలాగే భానునగర్ కాలనీలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారలు, ఉమామహేశ్వరరావు, సామ్యూల్ డేవిడ్ రాజ్, విజయప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ సమస్యలపై కేంద్ర ఎస్టీ కమిషన్‌కు వినతి



నాయక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు కేంద్ర ఎస్టీ కమిషన్‌కు స్టీల్‌ప్లాంట్ సమస్యలను వివరించారు. విశాఖ జిల్లా పర్యటనకు విచ్చేసిన కమిషన్ సభ్యులు అనంత నాయక్‌ను సంఘం ప్రధానకార్యదర్శి బయ్యే మల్లయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్. సత్యనారాయణ నేతృత్వంలో నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగేలా సహకరించాలని కోరారు. ప్లాంట్‌లో చీఫ్ జనరల్ మేనేజర్, విభాగాధిపతి స్థాయిలో ఏ ఒక్క ఎస్టీ అధికారి లేడని కమిషన్ దృష్టికి తెచ్చారు. జేవో నుంచి ఏఈ పదోన్నతుల్లో నోషనల్ సీనియార్టీ వర్తింప చేయాలని, ఏకలవ్య పార్కులో ఏకలవ్య, బిర్సాముండా, కొమరం భీమ్ విగ్రహాలు ఏర్పాటు చేయాలని, ఎస్సీ, ఎస్టీ ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్ (పర్సనల్) ఎస్‌సీ పాండేలు స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల కోసం తీసుకుంటున్న సంక్షేమ కార్యక్రమాలు, వారికి కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. కార్యక్రమంలో కమిషన్ అధికారులతో పాటు స్టీల్‌ప్లాంట్ జీఎం కె. సంజీవరావు, లైజన్ ఆఫీసర్ తిరుపతిరావు, సంఘం నాయకులు ఎల్.వి. రమణ, కె.వి. రత్నం, ఎం. గణేష్, ఎస్. మోహన్‌బాబు, డి. పుట్టారావు, పైడికొండల రావు తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్వారకా పీఎస్ పరిధిలో గొడవలకు పాల్పడుతున్న కొంతమందిపై నిఘా పెట్టినట్లు తెలిపారు. రౌడీషీటర్ల దినచర్య గురించి అడిగి తెలుసుకున్నారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని రౌడీషీటర్లకు సీఐ సూచించారు. కౌన్సెలింగ్ అనంతరం వారిని ఇళ్ల వద్ద పోలీస్ సిబ్బంది అప్పగించారు.